క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

నారాయణపేట రూరల్: జిల్లాలోని ఐదు మండలాలకు బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ నూతన అధ్యక్షులను నియమించారు. ఊట్కూరుకు చంద్రశేఖర్ గౌడ్, కొత్తపల్లి, గుండుమాల్ ఉమ్మడి మండలాలకు కేశవరెడ్డి, బొమ్రాస్ పేటకు శ్రవణ్ గౌడ్, దుద్యాల మండలానికి నారాయణయాదవ్‌ను నియమించారు. వీరు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు ప్రాథమిక పాఠశాలలో 1989–90వ సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన తోటి విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే తమకు చదువు నేర్పిన గురువులకు శాలువా, పూలమాల, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రంగయ్య, కన్కప్ప, కిషన్ రావ్, ఆనంద్, బసయ్యతో పాటు విద్యార్థులు మహిపాల్ గౌడ్, సవారి శ్రీను, కిషన్ సింగ్, గోవర్ధన్ రెడ్డి, పద్మ, ఇందిర, మాదవులు, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే ధ్యేయంగా పని చేయండి



ఊట్కూరు: బీజేపీ బలోపేతమే ధ్యేయంగా కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. బుధవారం ఊట్కూరులో బీజేపీ మండల అధ్యక్షునిగా ఎన్నికైన చంద్రశేఖర్‌గౌడ్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేసేలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్యగౌడ్, రమేష్, అశోక్, భరత్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



మాగనూర్ (మక్తల్): మక్తల్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. ఈ విషయంపై ఫారెస్టు సెక్షన్ అధికారి వెంకటేశ్వర్లుకు వాహనదారులు సమాచారం అందించగా ఆయన అక్కడికి చేరుకుని జింక కళేబరాన్ని వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. వెటర్నరీ డాక్టర్ శేఖర్ జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఖననం చేశారు.

ట్రాక్టర్‌కు నిప్పు.. పోలీసులకు ఫిర్యాదు

మల్దకల్: గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌కు నిప్పుపెట్టిన ఘటన మండలంలోని విఠలాపురం గ్రామంలో బుధవారం చేసుకుంది. బాధిత రైతు ఆనంద్ తెలిపిన వివరాలు.. రోజులానే వ్యవసాయ పనులు ముగించుకొని పొలం వద్దనే ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి ఉంచి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లగా ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైనట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల నమోదు

ధరూరు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీహరి అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుల్లో గందరగోళం


- రెండు నెలల క్రితం ట్యాక్స్ కట్టినా మళ్లీ కట్టాలని నోటీసులు
- ఏరియా ఆధారంగా విధించని పన్నులు

మద్దూరు: పట్టణానికి చెందిన నిడ్జింత చందు గతేడాది జులై 6న రూ.727 చెల్లించారు. అయితే మున్సిపాటీగా మారడంతో మళ్లీ ఇంటి ట్యాక్స్ కట్టాలని సిబ్బంది రూ.2732 పన్ను వేశారు. అతను దానిని కూడా చెల్లించారు. అందులో 2024–25 ఏరియల్ ట్యాక్స్‌లు రూ.2,840 (రెండు ట్యాక్స్‌లు), అలాగే 2025–26 ఏడాదికి కరెంట్ ట్యాక్స్‌లు రూ.2,732 (రెండు ట్యాక్స్‌లు) కట్టాల్సి ఉందని చూయించారు. ఏడాది కాలంలోనే రెండు సార్లు ట్యాక్స్‌లు చెల్లించినా మళ్లీ చెల్లించాలని చెప్పడంతో చందు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీలో ఇంటి ట్యాక్స్‌ల చెల్లింపుల్లో గందరగోళం నెలకొంది. ఆరు నెలల క్రితం, మూడు నెలల క్రితం, నెల క్రితం, ఇంటి ట్యాక్స్‌లు చెల్లించినా మళ్లీ ట్యాక్స్ కట్టాలని మున్సిపల్ సిబ్బంది తెలుపుతున్నారు. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో ఇంటి ట్యాక్స్ కడితే మున్సిపల్ పరిధిలో 5 శాతం పన్ను రాయితీ ఇవ్వనున్నట్లు ప్రచారం నిర్వహించింది. ఈ అవకాశం ఇటీవల ముగిసింది. ఈ ఏడాది జనవరి 27న మద్దూరు, రెనివట్ల గ్రామాలను కలిపి మద్దూరు మున్సిపాలిటీగా మార్చారు. ఇందుకు సంబంధించి వివరాలను సీఆర్‌డీఏలో అప్‌లోడ్ కావడంతో మున్సిపల్ సిబ్బంది ఇంటి పన్నుల వసూళ్లు చేపట్టారు. ఈ మున్సిపాలిటీకి ఈ ఏడాదికి ట్యాక్స్ డిమాండ్ రూ. 26 లక్షలు ఇవ్వగా ఇందులో ఇంటి పన్నులు రూ.11 లక్షలు ఉన్నాయి. 5 శాతం రాయితీతో సిబ్బంది ఇప్పటి వరకు రూ. 6 లక్షలు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.



చందు మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత చెల్లించిన రశీదు



మళ్లీ రెండు ఏడాదిలకు కలిపి చెల్లించాలంటూ మున్సిపల్ సిబ్బంది అందజేసిన డిమాండ్ నోటీసు

చిన్న ఇంటికి వేలల్లో.. పెద్ద ఇంటికి వందల్లో

మున్సిపాలిటీ పరిధిలో చిన్న ఇంటికి ట్యాక్స్ వేలల్లో వస్తే.. పెద్ద ఇంటికి మాత్రం వందల్లో వచ్చిన ఉదంతాలు మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంటున్నాయి. కమర్షియల్ వాటికి కూడా వందల్లో ట్యాక్స్ వస్తుంటే, రెండు గదుల ఇంటి మాత్రం వేలల్లో పన్నులు విధించారు. మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో జీపీ కన్న 5 శాతం మాత్రమే పన్ను పెరుగుతుందని అధికారులు చెబుతున్నా.. ఎక్కడా ఈ నిబంధన అమలు జరుగడం లేదని ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి కొలతలు తీసుకొని, ఇంటి నిర్మాణాన్ని బట్టి ట్యాక్స్‌లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్యాక్స్‌లపై ప్రక్షాళన చేస్తున్నాం:



గతంలో మద్దూరు, రెనివట్ల గ్రామాలు గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు సిబ్బంది సరైన కొలతలు తీసుకోకపోవడంతో ఈ సమస్య వచ్చింది. ఇందుకోసం మూడు టీంలను ఏర్పాటు చేసి ఇళ్ల కొలతలను చేపట్టడం జరుగుతుంది. అన్నింటిని మళ్లీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం. గతంలో ఇంటి ట్యాక్స్ చెల్లించిన వారు మళ్లీ చెల్లించాల్సిన అవసరం లేదు.

– శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, మద్దూరు.

కేంద్ర ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టండి



వనపర్తిలో కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలకు మోసం చేస్తుందని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి ఆర్ఎస్ రమేష్, సీపీఎం మండల కార్యదర్శి రాజు అన్నారు. ఈ నెల 20న జరిగే సమ్మెలో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మార్చిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి...

వనపర్తి రూరల్: ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనేందుకు బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధంతో వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయొద్దని, కార్మికులను బానిసలుగా మార్చొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం కురుమయ్య, బాలయ్య, లాలు, గోపాల్, శాంతయ్య, విజయ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

అమరచింత: గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో జరిగే తగాదాలు, చోరీల ను అరికట్టవచ్చని ఎస్ఐ సురేష్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో బుధవారం సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన వీధుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆయా కాలనీలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను నిలువరించే అవకాశం ఉందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా విరాళాలు అందించి వేగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

యూరియా వాడకం తగ్గించాలి



పామిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌నాయక్

- వనపర్తి వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, శాస్త్రవేత్తలు సుధాకర్, సిద్ధప్ప
- జీలుగతో పోషకాలు మెండు
- పంట మార్పిడి తప్పనిసరి

కొత్తకోట రూరల్: పంటలకు యూరియా వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సుధాకర్ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానాకాలంలో వరి పండిస్తే యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలన్నారు. పంట కోతల తర్వాత జీలుగ వేసి దుక్కి చేయడం ద్వారా ఎరువుల వాడకం 50 శాతం వరకు తగ్గించొచ్చని వివరించారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచన మేరకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలని సూచించారు. విత్తనశుద్ధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షల ప్రాముఖ్యత, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శోభూషణ్, మాధురి, ఎంఏఓ సైదులు, ఏఈఓలు మధు, అర్చన, కృష్ణయ్య, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు – నరేష్, వెంకటయ్య, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, మాజీ సర్పంచ్‌లు సిద్ధయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు ధర్నా

అమరచింత: పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించే చట్టం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గురువారం జరిగే రైతు ధర్నాను జయప్రదం చేయాలని ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. ఈనెల 8న అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆల్ ఇండియా కమిటీ ఆధ్వర్యంలో రైతు, రైతుకూలీల సమస్యలపై దేశంలో అన్ని రాష్ట్ర రాజధానిల్లో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని రకాల పంటలకు ఎంఎస్‌పీని చట్టబద్ధం చేయాలని, చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులకు పూర్తి రుణమాఫీ చేయాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యొక్క పరస్పర సుంకాలకు లొంగొద్దని, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలని నిర్వహించే ధర్నా కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు పాల్గొనాలని కోరారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయం నుంచి తాగునీటి కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. బుధవారం నాటికి పూర్తి స్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు గాను 1,015 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వ చ్చే నీటిని నిలిపివేశామని ఏఈ వరప్రసాద్ తెలిపారు. రామన్‌పాడు ఎడమ, కుడి కాల్వ ద్వారా 12 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడిపై చర్యలు శూన్యం

రాజోళి: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ప్రభుత్వ చర్యలు శూన్యమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చా లా గ్రామాల్లో మూడు రోజులకొకసారి కూడా తా గునీరు రావడం లేదన్నారు. తాగునీటి ఎద్దడిపై అధికారులు, అధికార పార్టీ నాయకుల చ ర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చే శారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ సమస్యల పరిష్కారం

అడ్డాకుల: ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. భూ భారతి చట్టం అమలు కోసం జిల్లాలో మూసాపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా పోల్కంపల్లి, సంకలమద్ది గ్రామాల రెవెన్యూ గ్రామ సభలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామ సభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో భూముల సమస్యలపై వచ్చిన ఆర్జీలను పరిశీలించారు. భూ సమస్యలపై ఆర్జీలు తెచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ మాట్లాడారు. భూ భారతి చట్టంలో పొందుపర్చిన అంశాలపై ప్రజలకు వివరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు అందజేసిన వారు తప్పకుండా వాటికి సంబంధించిన అన్ని రికార్డుల పత్రాలను కూడా అందజేస్తే విచారణలో అధికారులు సరైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోల్కంపల్లిలో 38, సంకలమద్దిలో 32 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్ రావు, తహసీల్దార్లు రాజు నాయక్, మదన్ మోహన్‌గౌడ్, గిర్దావర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



జెండా ఊపి క్రీడలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణిస్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోరంగేరి హన్మంతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో బుధవారం వర్ల్డ్ కిడ్స్ అథ్లెటిక్స్ డే సందర్భంగా జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను కోరంగేరి హన్మంతు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడలలో పాల్గొనడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. అలాగే జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ రమణ మాట్లాడుతూ.. 4 నుంచి 7 ఏళ్ల పిల్లలకు సాక్ రిలే, లెమన్ అండ్ స్పూన్ రిలే, డ్రెస్ అప్ రిలే, ఫజిల్ రిలే వంటి క్రీడాలు, 8 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు బ్రాడ్ జంప్ రిలే, స్ప్రింట్ రిలే, వాల్క్ రిలే వంటి తదితర క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బండి వేణు గోపాల్ రావ్, నందు నామాజీ, ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ హారిక దేవి, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ సింధూర్’కు మద్దతుగా సంబరాలు



మక్తల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మాగనూర్(మక్తల్): పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా బుధవారం తెల్లవారుజామున భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో పాటు పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై భారత వాయుసేన దళాలు దాడి చేసి ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి ఉగ్రమూకలను తుద ముట్టించడాన్ని స్వాగతిస్తున్నామని మక్తల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దానిని అంతం చేయాల్సిందేనని, ఉగ్రవాద నిర్మూలనలో ప్రభుత్వానికి వంద శాతం తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు జాతీయ జెండా చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

కృష్ణా: మండలంలో రైతులు పండించిన వరి ధాన్యంను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత నెల రోజులుగా రైతులు తమ ధాన్యంను కొనుగోలు చేయాలని అధికారులు, కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే సరైన సమయంలో గన్ని బ్యాగులు ఇవ్వకపోవడం, బస్తాల్లో నింపిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించుటకు అవసరమయ్యే లారీలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లారీ కాంట్రాక్టర్ తాను సీఎం మనిషిని అంటూ, తనను ఎవరూ ఏం చేయలేరని రైతులను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు, మిల్లర్లు రైతులను వేధిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రైతులకు బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



కోస్గి: పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

దామరగిద్ద: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి రాజు, ట్రైనీ ఎస్ఐ మహేశ్వరి తెలిపారు. నారాయణపేట మండలం పేరపళ్ల తండాకు చెందిన దశరత్‌నాయక్ అనుమతి లేకుండా బుధవారం రాత్రి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ట్రైనీ ఎస్ఐ మహేశ్వరి పట్టుకున్నారు. దశరత్‌తో పాటు దామరగిద్ద తండాకు చెందిన ట్రాక్టర్ యజమాని బుజ్జీబాయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

కోస్గి/ధన్వాడ: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకొని పోలీసులకు అప్పగించింది. గుండుమాల్ మండలం ముడిరెడ్డిపల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టుబడగా స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అలాగే ధన్వాడ మండలంలోని కొండ్రోన్‌పల్లి గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున ఓ ఇసుక ట్రాక్టర్‌ను ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

గ్రామ దేవతల ఉత్సవాలు



అమరవాయిలో పూజలు చేస్తున్న గొంగళ్ల రంజిత్‌కుమార్

ధరూరు: మండల పరిధిలోని ర్యాలంపాడు, కోతులగిద్ద గ్రామాల్లో నిర్వహించిన గ్రామ దేవతల ఉత్సవాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక విందు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, దౌలన్న, రంగస్వామి, నర్సింహులు, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. లవన్న, నెట్టెంపాడు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని అమరవాయి, పెద్దొడ్డి గ్రామాల్లో సవారమ్మ, సుంకులమ్మ, తాయమ్మ, కర్రెమ్మ, మైసమ్మ ఆలయాల్లో దేవర ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు పొట్టేళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజల ల్గొన్నారు.

మద్దూరులో వాసవీమాతకు ప్రత్యేక పూజలు



మరికల్‌లో వాసవీమాతకు కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



వాసవీమాత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

మద్దూరు: మద్దూరు పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో బుధవారం వాసవిమాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ విజయ్‌కుమార్ దంపతుల చేత అభిషేకం, ఒడి బియ్యం కార్యక్రమం జరిపించారు. అనంతరం మహిళలు సాముహిక కుంకుమార్చన చేసి అమ్మవారికి అలయం అవరణలో పల్లకి సేవా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు రాజయ్య, రమేష్, రవికుమార్, భరత్, గంగయ్య పాల్గొన్నారు.

ధన్వాడ: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను బుధవారం ధన్వాడ మండల కేంద్రంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని కోమటి కృష్ణయ్య ఇంటి నుంచి వాసవీ మాత విగ్రహాన్ని ఆర్యవైశ్యులు శోభయాత్రగా దేవాలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు ఉమేష్, పూజారి సుంకు నర్సిములుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత విగ్రహానికి ప్రత్యేక అష్టోత్తర, కలశ, కుంకుమార్చాన పూజలు జరిపించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.